# పిచుక గూళ్ళు

'దీపాలు పెట్టరు చదువుకోండర్రా' అనే తాతయ్య కేక నాలుగిళ్ళవాకిట్లో కాకీసి చెరువులో బుడంగు అనే వేళ నాకు చిరాకుగా. అందరం ఆ ఆజ్ఞకి పరాకుగా అఖరికి హరికేను లాంతరుచుట్టూ అరుమాళ్ళు పదహారుగా వేసిన పెరటిగోడ కుర్చీలు తీసిన పుంజీ గుంజీలు కార్చుబోయిన చిన్ని కన్నీళ్ళు అందులోనే మునిగింది ఏరాడకొండ.

జ్ఞాపకంఉందా దరగాకొండ! పలకపుల్లలతోటీ గాలి పడగలతోటీ నేస్తంకట్టినరోజుల్లో ఫర్లాంగుదూరం పది యోజనలు. ఇల్లే ఇండియా, పీర్ల పండుగ టాసాచప్పుడులో నేను నీతో చెప్పిన, ఎవరికీ చెప్పొద్దంటూ చెప్పిన రహస్యం రహస్యం కాదని ఎప్పటికి తెలిసిపోతుందో అప్పుడే దరగా కొండలో కొమ్ములు మొలచిన కొబ్బరికాయలో నీళ్లున్నాయో లేదో తేలిపోతుంది.

అంతకన్నా చిన్నప్పుడు ఆడుకొన్నాం బొమ్మల పెళ్ళి. అందులో నేను పెళ్ళాడేసిన బుజబుజ రేకులపిల్ల బుజ్జి రేకుల పిల్ల స్వామీదండలపిల్ల ఇవాళదాకా నాకు కనబడ లేదు. నిజముచెప్పనా వాజపేయంచేస్తే స్వర్గంలో మనకోసం రిజర్వు చేసేసుఖాల్లో గోడమీదబొమ్మ గొలుసుగొలుసుల బొమ్మ మాసం నవారుమంచం అద్దుపెట్టుకొని ఆడుకొనే అమ్మానాన్నా బువ్వాలాటలో పరికోరి ఎన్నుకొన్న మత్తే

అవడానికి వీలున్నట్టు అగస్త్యనాడిలో చదువుకో. దీపాలు పెట్టారు చదువుకోండర్రా! దీపాలు చదువుకోండర్రా!

దీపాన్ని చదువుకోడం చాలామంచిది. నేలమీద పాకేటప్పుడు దేవుడు తిన్నెమీద పెట్టిన జ్యోతిని చేత్తో చదువుకొన్నాను. ఆనాటినుండి ఈనాటిదాకా అంత విజ్ఞానం ముట్టుకొన్న పట్టుకొన్న ముద్దు పెట్టుకొన్న అవకాశం దొరకలేదు. అప్పుడు మామ్మ నాకు అమృతం పోసింది. కైలాసంలో కలకలాసవ్వే కర్పూరవృక్షాల చిగురుటాకులు కషాయం పెట్టి యిచ్చింది. దీపాన్ని చదువుకొన్నందుకు పాపం ఇవాళదాకా ఆవిడ నామీద చూపిన వాత్సల్యం ఆదికాలంలో అంజనీదేవి సూర్యుణ్ణి చుంబించిన ఆంజనేయుణ్ణి ఓదార్చుతూ పాడిన పాటలకంటే ఘట్టురకం మాటలు. అంజనీదేవి పద్యంలో, మామ్మ వచన పద్యంలో, ఆంజనేయుణ్ణీ, నన్నూ అప్పుడూ ఇప్పుడూ లాలించేరు.

మామ్మ దేవత! పసుపుపచ్చని సముద్ర పిసుకతిన్నెల మీద ఎర్రగా ఉదయించే సూర్యుడిలాగ చాయపసుపు రాసుకొన్న మామ్మ ముఖంమీద అర్ధణాకాసంత కుంకం బొట్టు—నాకు చిన్నప్పుడే ఎర్రరంగుమీద అభిమానం, పసుపు రంగుమీద అనుమానం నేర్పాయి. పిడికిలి బిగించి వ్రేళ్ళ కీళ్ళఎత్తుపల్లాల్లో ఏ ఇంగ్లీషుమాసాని కెన్నిరోజులో లెక్కపెట్టడం చేతకానప్పుడు రాకాసిబాబాయి నన్ను రాసి రంపాన పెడుతున్నప్పుడు రక్షించిన దేవతామూర్తి మామ్మ.

వంగపండురంగు పొత్తు పంచకట్టుకొని వెండిపువ్వుల పీటవాల్చి పొద్దునే కడుపు నింపే కరుణామయి! అందుకే

కాబోలు కరుణారసం తలచుకొన్నప్పుడల్లా మామ్మ నాకు జ్ఞాపకానికొస్తుంది.

ఆకాశవు చల్దికుండ
వెన్నెల తరవాణిలో
ఉన్నదొక్క టొకే పిడచ
కుండ నంటిపెట్టుకొన్నవి
రెండో మూడో మెతుకులు

చంద్రగ్రహణం అంటే ఏమిటో అడిగితే మామ్మ రాహువుగురించి చెప్పింది. రాకాసి బాబాయే రాహువు అని అన్నందుకు నా గూబ గుయ్యిమని మోత వేసిన ఎడమ చెవిలో ఋగ్వేదం వినబడి విడుపు స్థానంలేని చంద్రగ్రహణం ఆవేళే నాలో పట్టింది. మామ్మ విడిపించబట్టిగాని లేక పోతేనా!

రాబోకు రాబోకు చందురూడా
రాహు పొంచున్నాడు చందురూడా

అన్న బసవరాజు పాట నాకు తొడపాశం పెట్టడానికి అదే కారణం అనుకుంటా. చంద్రగ్రహణం నన్ను భయపెడితే సూర్యగ్రహణం నాలో కుతూహలాల పొట్లబిందెలకి రాళ్ళు కట్టింది. పళ్ళెంలో నీళ్లుపోసి రోకలిని నిలబెట్టి గ్రహణాన్ని రుజువు చెయ్యడం, గాజుముక్కలకి మసిపూసి సూర్యుణ్ణి చూడ్డం, పడగది తలుపులు మూసుకొని అమ్మా పిన్నీ గ్రహణం ఉన్నంతసేపూ పడుక్కోడం, ఇంట్లో ఉన్న నీళ్ళన్నీ పారపొయ్యడం అన్నీ ఆశ్చర్యాలే. ఎన్నో సందేహా

లున్నా అన్నీ పాఠాలే, అయినా అప్పటికే దీపాలు చదువు కోసంలో ఓపిక తగ్గిపోయిన నాకు పాఠాలనేసరికి టాట్టాలు.

అన్నీ ఒక యెత్తు! అట్లతద్ది ఒక ఎత్తు! తెల తెలవారే ముందు ఉట్టికింద ముద్ద తిని అక్కయ్యా, అత్తయ్యా ఉయ్యాల లూగేవాళ్ళే అప్పుడు అల్లరిపెట్టినందుకు ఆడ పిల్లని కానందుకు మారాముచేసే నాకు మామ్మ పరికిణీ కట్టనందుకు ఆవేళ కోపంవచ్చినా ఇవాళ కృతజ్ఞుణ్ణి. సెట్టి మాస్టారి పప్పుడీ పాటల్లో అట్లతద్ది వర్ణన అంతగా నేను మెచ్చుకోకపోవడానికి కారణం ఆ నాడు నేను పరికిణీ కట్టుకోకపోవడమే!

శివరామయ్య స్కూల్లో చదువుకొంటున్నట్టు నటించే రోజుల్లో మూడవక్లాసు జవాభాకి మాష్టరుగారు హరిశ్చంద్రుడిపాఠం ఉపదేశం చేస్తున్నప్పుడే అబద్ధాలాడితే ఆకలి తీరుతుందని నేర్చుకొన్నాం. హరిశ్చంద్రుడిపాఠం అయిపోయాక హోంవర్కు చెయ్యనందుకు పేపబెత్తాలు చేతిమీద విరుగగొట్టే మాష్టరు ఏ అబద్ధంచెప్తే నమ్ముతాడని ఆలోచిస్తున్నప్పుడు నందికేశుడు అడ్డుపడ్డాడు—ఎవరింట్లోనో నందికేశుడునోము నోచుకున్నారట. బ్రాహ్మణకుర్రాళ్లు వెళ్ళి అట్లుతినమని హెడ్మాస్టరు ఆజ్ఞాపించినప్పుడు ప్రాణం లేచొచ్చింది. కిరస్తానుల కుర్రాడొకడు మనలో కలసిపోయ్యాడు.

వాడు బ్రాహ్మణ కుర్రాడని ప్రమాణము చేశాము. వాడి కడుపు నిండింది. అప్పుడు అబద్ధంచెప్పిన పాపంవల్లే ఇప్పటికీ రుచికరమయిన అట్లూ, పొంగరాలు దొరుకుతున్నాయి. కిరస్తానులకుర్రాడు పదహారోఅట్టు తింటున్నప్పుడు

అబద్ధం బయటపడ్డాది. నోస్తున్న నందికేసుడినోము మంట కలిసింది. మా పెద నన్నగారి కుఱ్ఱాడు, యలమంచిలినుంచి వచ్చాడు, అని నేను ప్రమాణం చేసినందుకే కిరస్తానుల కుఱ్ఱాడిని యి సత్రిముందు కూర్చోనిచ్చారు. వాడు పదిహేనో అట్టు పూర్తిచేసి పదహారోది వేయించుకొంటూ వున్నప్పుడు అంతట మామ్మ ప్రవేశించింది. మనం నిష్క్రమించాం. మామ్మ దేవత కాబట్టి మన్ని నందికేసుడి కొమ్ములవాడి నుంచి కాపాడింది.

'లలాటాన కుంకుమాగ్ని
భుజంమీద మబ్బుదుబ్బు
కాళ్ళకింద కిఱ్ఱుచెప్పు
అంగోస్త్రం పొడుంకాయ

అని మనవాడు వర్ణించినట్లు తాతయ్య వచ్చినప్పుడు పిచ్చాసుపత్రిని చూడటానికి వెళ్ళాను. ఒకోట ప్రతాపరుద్రీయం, ఒకోట బృహన్నారదీయం. వెయ్యి తాచ్చిప్పలను మింగిన వెఱ్ఱికుక్కకి గాలివాన, చీకటిపడుతూంది. వర్షం పడుతూంది. రొజగాల గజగజ ఈదురుగాలి చీదవ కెరటాలు కొడుతున్నాయి. తీరపువాళ్లు సముద్రంలో మునిగిపోయిన వైశాఖస్వామి దేవాలయంలో జే గంట వాయిస్తున్నారు. దీపారాధన చేస్తున్నారు. అదీ అసలు విశాఖపట్నం. అదీ నా జనని. అదీ నా జన్మభూమి. అది స్వర్గా దపి గరీయసి. రాకాసి బాబాయి అడుగుపెట్టడానికి వీల్లేని చోటు. లక్ష లాటి మామ్మలు దేవతలు తిరిగే చోటు.

సముద్రంలో ఊరు. సముద్రంలో పేట. సముద్రంలో కోట. ఎన్ని నిలువుల లోతులో ఇల్లుంటే అంత గొప్పవాళ్ళన్నమాట! మా ఇల్లు ఎవరెస్టు శిఖరం ఎంత ఎత్తుందో అంత లోతున ఉంది. సముద్రపు పలకపుల్లలతో, శంఖాలతో కట్టిన గోడలు, గవ్వలతో పేర్చిన నేలలు, దివ్య మాణిక్య కాంతులు.

వైశాఖస్వామి దేవాలయంలో అర్చనచేసే సమయంలో హారతి కర్పూరమే ఆరని ముద్దగా అవతారందాల్చి స్వామికిసాగిలపడి సముద్రంలో ప్రయాణంచేసి కెరటాలమీద స్వారిచేసి వేకువజామున మిన్నులుపడ్డచోట నీళ్ళని చీల్చుకొని సూర్యబింబంలాగ బయట కొస్తుంది. అందుకే విశాఖపట్నంలో సూర్యోదయం సముద్రంలో అవుతుంది. వైశాఖస్వామి దేవాలయంలోని ప్రజ్వరిల్లుతున్న కర్పూరఖండమే బయట ప్రపంచానికి సూర్యబింబం అని చెప్పానుగానీ, ఆ కర్పూరఖండం ఏమిటో తెలుసా, మా అమ్మ మొఖంమీది కుంకుమముద్ద. దాన్ని నీరాంజనంగా నివాళిగా నీటిలోని దేముడికి నీటితో వెలిగించి ఇస్తుంది. ఆమెకి పిచ్చెక్కినప్పుడే అది బడబాగ్ని అయింది. ఆ కథ మనం స్మరించకూడదు!

నాకూ ఒక తిమింగలంపిల్లకీ స్నేహం. గాని మా యింట్లోవాళ్ళు మా యిద్దర్నీ ఆడుకోనిచ్చేవారు కాదు. అప్పుడప్పుడు పచ్చనీటి మైదానంమీద సొరచేపల సర్కస్ గుడారాన్ని పాతినప్పుడు నేనూ తిమింగిలంపిల్ల దొంగతనంగా చెట్టాపట్టా వేసుకొని టికెట్టులేకుండా లోపలికి దూరాం. ఆ సొరచేప లేంచేశాయో తెలుసా, వాళ్ళ సర్కస్ కంపెనీ

లోంచి తప్పించుకొని పోయిన తిమింగలం అదే అనుకొని దాన్ని నీటిగడ్డిలో కట్టేసి దానిచేత అష్టమయిన సిల్లి మొగ్గలూ వేయించారు. ఆనాటినుంచే నేను టిక్కెట్టు కొనకుండా సర్కస్ చూడ్డం మానేశాను. నీటిబుడగలకీ ఎంగ్రపీతలకీ జరిగిన యుద్ధం నేను ఇప్పటికీ మరచిపోలేదు. ఎనిమిదో నిలువులోంచి వచ్చే కెరటాలని యెవరు సాగుచేసుకోవాలని వాళ్ళ వాళ్ళ పెద్దవాళ్ళు కొట్లాడుకొంటూవుంటే సముద్రపు గాలి పడగలు ఎగురవేసుకొనడంలో వీళ్ళకీ వీళ్ళకీ దెబ్బలాట జరిగింది. నీటిబుడగలని రెండు డెక్కలతోటీ పట్టుకొని ఒక్కొక్క ఎంగ్రపీత నొక్కుతూడుంటే నా గుండెలని పిండేస్తున్నట్టనిపించి నా నరాలు కుంగిపోయి రాకాసిబాబాయి నా చెవులు మెలివేస్తున్నట్టు భయపడి గబుక్కున వెళ్ళి మామ్మ ఒళ్ళో తలదాచుకొన్నా! 'ఒరే ఒడ్డుకుపోయి పిచ్చుకగూళ్ళు కట్టుకోరా నీ కేం భయంలేదు అంది.

సముద్రంలోని ఇల్లు ఒదిలిపెట్టి వెళ్ళడం నాకు సాయించలేదు. గాని మహాలక్ష్మిసమానురాలైన మామ్మ మాటకి ఎదురు చెప్పడం నాకు చేతకాదు. పోనీలే శంఖాలు కట్టిన నీటిగోడలమీద దడిగాడు వానసిరా, దానికి రాణేవసు అని రాయడానికి యెలాగా వీల్లేదు. నీటిమీదవ్రాత ఆటొచ్చినప్పుడు ఆటోగ్రాఫ్, ఫోటొచ్చినప్పుడు ఫోటోగ్రాఫ్ అవదుకదా అని ఒడ్డుకొచ్చా. అప్పట్నుంచీ నా జీవితం ఆటవిడుపు అయింది.

తిమింగిలం పిల్లని సర్కస్ కంపెనీ చెరపట్టినప్పట్నుంటీ నాకు స్నేహితులే లేకపోయారు. ఒక్కణ్ణే యెంతకాలం ఒంటి పిల్ల రాకాసిలాగ ఆడుకొంటాను? అయినా నా జట్టు కట్టిన వాళ్ళకే యిట్టే ఆపద లొస్తాయి. వెనక యెవరితోనూ పొత్తు కలుపకూడ దనుకున్నా. బీచిలో రాత్రిపూట చలిగాలులే ఇసుకమీద వెలకితలా పడుక్కొని వైశాఖస్వామి ఆలయంలో హారతి ముద్ద ఎప్పుడు బయటికొస్తుందా అని ఎదురు చూస్తున్నా—అన్నట్టు చెప్పడం మరచిపోయా. ఆ రోజుల్లో అదే నా ఆహారం. అది కళ్ళతో తిని కడుపు నింపుకునేవాణ్ణి.

అప్పుడు హఠాత్తుగా సూర్యోదయ మయింది. అందాకా వేగుచుక్కలా ఉంటున్న ఒక బంగారుపిచ్చికా, ఒక ఊరపిచ్చికా పాపం వాళ్ళదేశంలో అగ్నిపర్వతం పగలడంచేత, అస్థిపంజరాలు నవ్వటంచేత ఉండటానికి ఇల్లు లేక నా కళ్ళముందు వాలాయి. వాళ్ళకి సానుభూతి చూపించి, వేగుచుక్క భూకంపంబాధితులనిధి అని ఒక నిధిని స్థాపించి చాను. సముద్రపొడ్డున చందాలు సేకరించా. ఆరు చందమామలు రెండు గుడ్డిగవ్వలూ, నాలుగు పుల్లలూ వసూలుచేశాను చెప్పొద్దూ! పిచికలు వీ ట్నం చేసుకుంటాయని అవన్నీ నేను స్వాంతం చేసుకున్నా. అవి నామీద దావా చేశాయి. పిచికలకి ఇల్లు కట్టించడానికిగాను పోగు చేసినచందా వాడుకొన్న నేరానికి కోర్టువారునన్ను శిక్షించారు. పిచికలకి గూళ్ళు కట్టించి ఇమ్మన్నారు.

తీరాన్ని కెరటాలు ముద్దు పెట్టుకొనేచోట, తరంగాలు సముద్రించే దగ్గర బంగారపిచ్చిక తనకి గూడు కావాలంది. అక్కడే కట్టివ్వమని ఆర్డరు వేశారు కోర్టువారు. ఊర పిచుక ఊరవతల కావాలంది. దానికిమట్టుకూ నేనూ ఒప్పుకోలేదు. వాళ్ళూ ఒప్పుకోలేదు. బీచొడ్డున గూడుకట్టడం మొదలెట్టా. అమెరికా దేశంనుంచి ఇంజనీర్లొచ్చి ప్లానులు వేశారు. ప్రధాన మంత్రులు మట్టుకూ ప్రారంభోత్సవం చేస్తామని హామీ ఇవ్వలేదు. పంచాయితీ బోర్డు ప్రెసిడెంటుచేత ఆవిష్కరణోత్సవం చేయిద్దామనుకొన్నా. గూడు సగం పూర్తయింది.

గోడలు లేచాయి. కిటికీలు పెట్టాను. అంతలో కెరటాలొచ్చి అంతా నేలమట్టం చేశాయి. మళ్ళీ గోడలుకట్టాను. గోపురాలు లేపాను. ఇంతలో కెరటాలొచ్చి ఇంతా నేలమట్టం చేశాయి. తిరిగి గోడలు చేశాను. గోతులు తీశాను. మళ్ళీ కెరటాలొచ్చి మస్తుగా-తీసుకుపోయ్యాయి. త్రేతాయుగంనుంచీ యిలాగే జరుగుతున్నది. నన్నుచూచి ఎందరెందరో కుర్రాళ్లు కట్టడం మొదలెట్టారు. ఏఒక్క గూడైనా నిలబడితే అందులో బంగారు పిచ్చికని ఉండనిచ్చి నన్ను విడుదల చేద్దామనుకున్నారు. ఏ ఒక్క-గూడూ నాలుగు నిమిషాలపాటు ఉంటంలేదు.

గూడుకడుతున్న కుర్రాళ్ళని, చీకటిపడ్డది ఇళ్ళకి పదండర్రా! దీపాలుపెట్టారు చదువుకోండర్రా! అని తాతయ్యలు

తీసుకు పోతు న్నారు. నేనుమట్టుకూ ఇంకా పిచ్చిగూళ్లుకడుతూనేవున్నా. బంగారుపిచ్చిక మట్టుకూ ఏదో ఫస్టుక్లాసు హోటల్లో గదితీసుకొని ఉంటున్నాది.

రండి కుర్రాళ్ళు రండి. పిచ్చిగూళ్ళు కట్టండి, నన్ను విడుదల చేయండి. నాగుండె ఏరాడకొండ నన్ను కరిగించండి.

దీపాలు పెట్టేరు చదువుకోండర్రా! అనే తాతయ్య కేక నాలుగిళ్ళ వాకిట్లో కాకేసి చెరువులో బుడంగు అనే వేళ నాకు చిరాకుగా అందరూ ఆ ఆజ్ఞకి పరాకుగా ఆఖరికి హరికేనులాంతరుచుట్టూ ఆరుమూళ్ళఅరవై ఆరుగా వేసిన మందడిగోడకుర్చీలు తీసిన తాటిముంజెల గుంజెలు కార్చిన కారునల్లని కన్నీళ్ళుకట్టాయి, పిచికగూళ్ళు అందులో ఉంటుంది ఏరాడకొండ.